సాక్షి ఖమ్మం

గురువారం ౹ 29 ౹ జూన్ ౹ 2023



మాదకద్రవ్యాల రవాణాపై నిఘా

జిల్లాలో మాదకద్రవ్యాల రవాణా, వాడకాన్ని అరికట్టేందుకు గట్టి నిఘా ఏర్పాటుచేశామని కలెక్టర్ గౌతమ్ వెల్లడించారు. 8లో



నిర్వాసితులకు నిరాశే!

అశ్వాపురం మండలంలో సీతమ్మసాగర్ ప్రాజెక్టు పరిశీలనకు వచ్చిన బృందాన్ని కలిసే అవకాశం నిర్వాసితులకు దక్కలేదు. 8లో

గరిష్టం / కనిష్టం

35° / 26°

వాతావరణం

జిల్లాలో గురువారం ఉక్కపోత వాతావరణం ఉంటుంది. కొన్నిచోట్ల ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురిసే అవకాశముంది.

న్యూస్‌రీల్

రోడ్లు, భవనాల నిర్మాణానికి రూ.43 కోట్లు

ఖమ్మంఅర్బన్: జిల్లాలో రోడ్లు, భవనాల నిర్మాణం, అభివృద్ధి పనులు కోసం ప్రభుత్వం రూ.43.21కోట్లు కేటాయించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను కాపిటల్ అసెట్స్ క్రియేషన్ ఫండ్(మూలధన పెట్టుబడుల కోసం సాయం) కింద ఈ మొత్తం విడుదల చేస్తూ జీఓ జారీ చేశారు. ఈ నిధుల నుంచి ఖమ్మంలో ప్రభుత్వ మెడికల్ కాలేజీ విద్యార్థుల హాస్టల్ భవన నిర్మాణానికి రూ.8కోట్లు, పాలేరులో ప్రభుత్వ నర్సింగ్‌కాలేజీ భవనాల నిర్మాణానికి రూ.15కోట్లు, మధిర ప్రభుత్వ ఆస్పత్రి సామర్థ్యం పెంపునకు రూ.15 కోట్లు వెచ్చిస్తారు. అలాగే, నేలకొండపల్లి మండలంలోని కోనాయిగూడెం, నాచేపల్లి, ఆరేగూడెం, గువ్వలగూడెం, ముజ్జుగూడెం, అనాసాగరం రోడ్డు నిర్మాణానికి రూ.5.21 కోట్లు కేటాయించినట్లు జీఓలో పేర్కొన్నారు.

ఘనంగా పీ.వీ.జయంతి



పీవీ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న దుర్గాప్రసాద్, నాయకులు

ఖమ్మం సహకారనగర్: జిల్లా కేంద్రంలోని కాంగ్రెస్ కార్యాలయంలో దివంగత మాజీ ప్రధాని పీ.వీ.నర్సింహారావు జయంతి వేడుకలను బుధవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్ పీ.వీ. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించాక ఆయన సేవలను కొనియాడారు. ఈకార్యక్రమంలో నాయకులు నాగండ్ల దీపక్ చౌదరి, పుచ్చకాయల వీరభద్రం, భారతిచంద్రం, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

స్కూల్ బస్సుల ఫిట్‌నెస్‌పై స్పెషల్ డ్రైవ్



స్కూల్ బస్సు పత్రాలను పరిశీలిస్తున్న ఎంవీఐ

ఖమ్మంక్రైం: ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేకుండా పాఠశాలల బస్సులు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకునేందుకు రవాణా శాఖ అధికారులు రంగంలోకి దిగారు. ఆర్టీఓ కిషన్‌రావు ఆదేశాల మేరకు ఎంవీఐ వరప్రసాద్ ఆధ్వర్యాన జిల్లా కేంద్రంలో బుధవారం స్పెషల్ డ్రైవ్ చేపట్టారు. ఈ సందర్భంగా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ లేని నాలుగు ప్రైవేట్ స్కూల్ బస్సులను సీజ్ చేసినట్లు ఎంవీఐ తెలిపారు. సర్టిఫికెట్ సర్టిఫికెట్ తీసుకోని యజమాన్యాలపై పాటు నిర్లక్ష్యంగా బస్సులు నడిపే డ్రైవర్లపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించచారు.

ప్రారంభమైన ఎంసెట్ కౌన్సెలింగ్



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఇంజనీరింగ్ కళాశాలల్లో చేపట్టిన ఎంసెట్ కౌన్సెలింగ్ బుధవారం ప్రారంభమైంది. ఖమ్మంలోని ఎస్ఆర్ అండ్ బీజీఎన్ఆర్ డిగ్రీ కళాశాల సెంటర్‌కు స్లాట్ బుక్ చేసుకున్న విద్యార్థులు ఉదయమే చేరుకున్నారు. ప్రతిరోజు 800 మంది స్లాట్ బుక్ చేసుకునే అవకాశం ఉండగా, వచ్చే నెల 4వ తేదీ వరకు రోజుకు 800 స్లాట్లు బుక్ అయ్యాయని కౌన్సెలింగ్ సెంటర్ కోఆర్డినేటర్ సుబ్రహ్మణ్యం తెలిపారు. జిల్లాతో పాటు సమీప జిల్లాల విద్యార్థులు సైతం సర్టిఫికెట్ల పరిశీలనకు ఖమ్మంను ఎంచుకోవడంతో సెంటర్ కిటకిటలాడింది.

30వ తేదీన కేయూ పరిధిలో పరీక్షలు వాయిదా

కేయూ క్యాంపస్: కాకతీయ యూనివర్సిటీ పరిధిలో ఉమ్మడి వరంగల్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల్లో ఈనెల 30న జరగాల్సిన డిగ్రీ సహా ఇతర పరీక్షలు వాయిదా వేశారు. పరీక్షల నియంత్రణాధికారి పి.మల్లారెడ్డి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ ఎ.నరేందర్ బుధవారం ఈ విషయాన్ని వెల్లడించారు. జూలై 1న గ్రూప్–4 పరీక్ష ఉన్నందున ఈనెల 30న జరగాల్సిన పరీక్షలను వాయిదా వేసినట్లు తెలిపారు. ఆయా పరీక్షలు మళ్లీ ఎప్పుడు నిర్వహించేది తర్వాత వెల్లడిస్తామని, మిగతా పరీక్షలు టైంటేబుల్ ప్రకారమే జరుగుతాయని ప్రకటించారు.

విత్తనం ఎంపికలో జాగ్రత్త



రైతుల సందేహాలకు సమాధానం ఇస్తున్న డీఏఓ విజయనిర్మల

సాక్షి ఫోన్ ఇన్

పంటల సాగులో కీలకమైన విత్తనాల ఎంపికలో రైతులు అప్రమత్తంగా వ్యవహరించాలని జిల్లా వ్యవసాయాధికారి (డీఏఓ) ఎం.వి జయనిర్మల సూచించారు. వానాకాలం సీజన్ మొదలైన నేపథ్యాన రైతుల సందేహాలను నివృత్తి చేసేందుకు బుధవారం 'సాక్షి' ఆధ్వర్యంలో ఫోన్ ఇన్ నిర్వహించగా జిల్లా నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో రైతులు ఫోన్ చేశారు. నిర్ణీత వ్యవధిలో పలువురితో మాట్లాడిన డీఏఓ వారి సందేహాలు నివృత్తి చేయడంతో పాటు సలహాలు ఇచ్చారు. విత్తన రకాలు, కాలపరిమితి, అందుబాటులో ఉన్న విత్తనాలను వివరించడంతో పాటు ప్రభుత్వ ధ్రువీకరణ పొందిన కంపెనీలు, ఏజెన్సీలు, సంస్థల విత్తనాలు మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. అలాగే, పంట కాలం పూర్తయ్యే వరకు బిల్లులు భద్రపర్చుకోవాలని చెప్పారు. అంతేకాకుండా వరి, మిర్చి, పత్తిలో కొత్త వంగడాల వివరాలు వెల్లడించారు. డీఏఓతో పాటు వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులు బి.సరిత, వైరా కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ హేమంత్ కుమార్, శాస్త్రవేత్త డాక్టర్ రవికుమార్ కూడా పాల్గొని రైతుల సందేహాలు నివృత్తి చేశారు. – ఖమ్మంవ్యవసాయం

- ధ్రువీకరించినవే కొనుగోలు చేయాలి
- అదునులో పంటలు నాటితేనే మేలు
- వరిలో స్వల్పకాలిక, మధ్య కాలిక రకాల సాగు మేలు
- రైతుల సందేహాలకు డీఏఓ విజయనిర్మల సమాధానాలు

ప్రశ్న : నకిలీ విత్తనాల గుర్తింపు, కొనుగోళ్లలో ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి?

– సుధాకర్‌రెడ్డి, మల్లాయిగూడెం, కూసుమంచి మండలం

జవాబు : ప్రభుత్వ లైసెన్సు లేని దుకాణాలు, వ్యక్తులు విక్రయించే విత్తనాలను నకిలీవిగానే భావించాలి. అలాగే, ప్యాకెట్లలో కాకుండా లూజ్‌గా విక్రయించినా తీసుకోవద్దు. లైసెన్స్ కలిగిన షాపుల్లోనే విత్తనాలు కొనుగోలు చేసి బిల్లులు భద్రపర్చుకోవాలి. విత్తనాల విషయంలో అనుమానం వస్తే అధికారులకు సమాచారం ఇవ్వాలి.

ప్ర: మిర్చి నారు పెంచేందుకు ఏ రకం విత్తనాలు మంచివి? – శోభన్, శ్రీరాంపురం తండా, ఏన్కూరు మండలం

జ : నేల ఆధారంగా అధిక దిగుబడిని ఇచ్చే విత్తనాలు ఎంచుకోవాలి. వర్షం వస్తే నారు కుళ్లి పోకుండా ఎత్తు నారుమడులు పోసుకోవాలి. గ్రామాలకు వచ్చే వారి నుంచి విత్తనాలు కొనుగోలు చేయొద్దు.

ప్ర : మాగాణి భూముల్లో వరి సాగుకు మేలైన పద్ధతులు ఏమిటి?

– బానోత్ రవి లింగారం తండా, కూసుమంచి మండలం

జ: పొడి దుక్కిలో వెదజల్లే పద్ధతిలో వరి సాగు చేసుకోవచ్చు. పొడి దుక్కికి అవకాశం లేకపోయినా వెదజల్లే పద్ధతి మంచిదే. మాగాణి భూముల్లోనైతే దమ్ము చేసి వెదజల్లడం, డ్రమ్ సీడర్ ద్వారా విత్తనాలు వేసుకోవచ్చు. ఇవేవి కాకపోతే వరి నాటే పద్ధతి అవలంభించాలి.



ఫోన్ ఇన్‌లో పాల్గొన్న ఏడీఏ సరిత, శాస్త్రవేత్తలు డాక్టర్ హేమంత్‌కుమార్, రవికుమార్

ప్ర : దుక్కి దున్నే ందుకు తక్కువ కిరాయికి ట్రాక్టర్లు లభిస్తాయా?

– ఆనందరావు, జాస్తిపల్లి, కామేపల్లి మండలం

జ: కస్టమ్ హైరింగ్ సెంటర్లలో నిర్దేశించిన కిరాయికి ట్రాక్టర్లు లభిస్తాయి. వ్యవసాయ విస్తర్ణాధికారి, మండల వ్యవసాయాధికారిని సంప్రదిస్తే అందుబాటులో ఉన్న సెంటర్లు, అద్దె వివరాలు వెల్లడిస్తారు.

ప్ర : అధిక సాంద్రత విధానంలో నాటిన పత్తి గింజలు కొన్ని మొలవలేదు. మళ్లీ నాటాలంటే మొదటి కంపెనీవే వాడాలా?

– తుమ్మల రాణా ప్రతాప్, వల్లాపురం, వైరా మండలం

జ: అధిక సాంద్రతలో సాగు చేసే పత్తిలో తొలుత నాటిన రకం పత్తి గింజలను మాత్రమే నాటాలి. ఇతర రకాల విత్తనాలు నాటితే దిగుబడిలో తేడా వస్తుంది.

ప్ర : వర్షాలు లేక వరి సాగు ఆలస్యమవుతున్నందున ఏ రకం ఎంపిక చేసుకోవాలి?

– గరిడేపల్లి రామారావు, సుర్దేపల్లి, నేలకొండపల్లి మండలం

జ : వర్షాలు ఆలస్యమవడంతో దీర్ఘకాలిక రకాల కన్నా మధ్య కాలిక, స్వల్ప కాలిక రకాలను ఎంచుకుంటే మేలు. మధ్య కాలిక రకాల పంట కాలం 130 – 135 రోజులుకాగా, స్వల్ప కాలిక రకాల పంట కాలం 120 నుంచి 125 రోజుల వరకు ఉంటుంది. మధ్యకాలిక రకాల్లో డబ్ల్యూజీఎల్–14, డబ్ల్యూజీఎల్ 32100, స్వల్పకాలిక రకాల్లో ఆర్ఎన్ఆర్ 15048, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ –96, డబ్ల్యూజీఎల్ 1487, జేజీఎల్ 24423, కేఎన్ఎం –118 రకాలు ఎంపిక చేసుకోవచ్చు.

ప్ర : నల్ల రేగడి నేలల్లో ఏ వరి రకాలైతే మంచిది?

– కె.వెంకటేశ్వర్లు, నేలకొండపల్లి

జ : నల్లరేగడి నేలల్లో ప్రస్తుత తరుణాన స్వల్పకాలిక, మధ్య కాలిక రకాలు సాగు చేసుకోవచ్చు. ఈ నేల దమ్ములో వరిని వెదజల్లే పద్ధతుల్లో లేదా డ్రమ్ సీడర్ పద్ధతిలోనూ సాగు చేసుకోవచ్చు. లేదంటే నాట్లు వేసే పద్ధతి కూడా ఎంచుకోవచ్చు.

ప్ర: ట్రైకోడెర్మా విరిడి, సూడోమోనాస్ వంటి జీవనియంత్రణ ఎరువులు సబ్సిడీపై ఎక్కడ లభిస్తాయి?

– శ్రీనివాసరెడ్డి, కల్లూరు గూడెం, వేంసూరు మండలం

జ : ట్రైకోడెర్మా విరిడీ, సూడోమోనాస్ ప్రస్తుతం ఖమ్మం గట్టయ్య సెంటర్‌లోని జీవనియంత్రణ ప్రయోగశాలలో అందుబాటులో ఉన్నాయి. మిర్చిలో ఎండు తెగులు, వేరుకుళ్ల నివారణకు ఇవి బాగా పనిచేస్తాయి. పశువుల ఎరువుతో కలిపి వారం నీడలో ఉంచి వినియోగించుకోవచ్చు.

ప్ర : కూరగాయలు, పండ్ల తోటల సాగుకు విత్తనాలు, ఎరువులు, సాగు పరికరాలు అందిస్తారా? అకాల వర్షాలతో నష్టపోయిన బొప్పాయి పంటకు పరిహారం వస్తుందా? – గద్దం అంజయ్య గౌడ్

జ : కూరగాయలు, ఉద్యానవన పంటల సాగును ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం సబ్సిడీలు అందజేస్తోంది. ఉద్యాన శాఖ అధికారిని సంప్రదిస్తే వివరాలు చెబుతారు. వర్షాలతో దెబ్బ తిన్న పంటల విషయమై వ్యవసాయ, ఉద్యాన అధికారులను సంప్రదించాలి.

ప్ర : మిరపలో వైరస్ తెగుళ్ల నివారణ చర్యలు తెలపగలరు? – నారపోగు నాగరాజు, సిరిపురం, వైరా మండలం

జ : ఏ పంటలోనైనా తెగుళ్లను అరికట్టుకోవాలంటే విత్తనశుద్ధి ప్రధానం. మిరపలో వైరస్‌ను నియంత్రించాలంటే ట్రైసోడియం ఆర్థో ఫాస్ఫేట్‌తో విత్తన శుద్ధి చేసుకోవాలి. తద్వారా రసం పీల్చే పురుగు, వైరస్‌లు ఆశించవు.

ప్ర : ఉద్యాన పంటల సాగు వివరాలు తెలుసుకోవడం ఎలా?

– ఆపద వెంకటరామారావు, అన్నారుగూడెం, తల్లాడ మండలం

జ : ఉద్యాన అధికారులు నియోజకవర్గానికి ఒకరు ఉంటారు. పంటల సాగు సమస్యలు, తెగుళ్ల నివారణ కోసం అందుబాటులో ఉన్న వ్యవసాయాధికారులను కూడా సంప్రదించవచ్చు.

ప్ర : సబ్సిడీపై విత్తనాలు ఎక్కడ ఇస్తున్నారు?

– జంగం లక్ష్మీనారాయణ, కోనాయిగూడెం, నేలకొండపల్లి మండలం

జ : పచ్చిరొట్ట ఎరువులను సబ్సిడీపై ఇస్తుండగా, మిగిలిన వాటిపై సబ్సిడీలు లేదు. సహకార సంఘాలు, రైతు సేవా కేంద్రాల్లో తెలంగాణ విత్తనాభివృద్ధి సంస్థ విత్తనాలను అందుబాటులో ఉంచింది. ఎంచుకున్న పెసర విత్తనాల కకోసం మధిర పరిశోధనా స్థానంలో సంప్రదించాలి.

ప్ర : వరిలో అగ్గి తెగులు నివారణ ఎలా?

– గంగిరెడ్డి, గువ్వలగూడెం, ఖమ్మం రూరల్ మండలం

జ : వరినారులో అగ్గి తెగులు నివారణకు మైసైక్లోజోల్ 0.6 గ్రాములు, లెసోప్రకలిన్ 1.5 మి.లీ, కాసుగామైసిన్ 2.5 మి.లీ.ను లీటర్ నీటికి కలిపి పిచికారీ చేస్తే ఫలితం ఉంటుంది.

ప్ర : వరిని పొడి దుక్కుల్లో చల్లితే ఎదురయ్యే కలుపు సమస్య నివారణ చర్యలు వివరించండి?

– ఫణికుమార్, పుల్లయ్యబంజర, తల్లాడ మండలం

జ : వరి పొడి దుక్కుల్లో వెదజల్లే పద్ధతితో కలుపు సమస్య ఉంటుంది. దుక్కిలో పదును ఉంటే వరి విత్తనాలు చల్లిన 48 గంటల్లో పిండి మిథాలిన్ 1.2 లీటర్లు, స్టాంప్ ఎక్స్ట్రా 700 మి.లీను చల్లి కలుపు నివారించవచ్చు. విత్తిన 15 నుంచి 20 రోజుల కాలంలో కలుపు మందు చల్లుకోవచ్చు.

ఈ ఏడాది నుంచే మెడికల్ కళాశాల



ఫాకో మిషన్‌ను ప్రారంభిస్తున్న మంత్రి పువ్వాడ, పక్కన కలెక్టర్ గౌతమ్ తదితరులు

- ఇప్పటికే వంద సీట్లకు అనుమతి
- శరవేగంగా భవన నిర్మాణాలు, ఆధునికీకరణ పనులు
- రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్

ఖమ్మం వైద్యవిభాగం: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ మెడికల్ కళాశాలలో ఈ విద్యా సంవత్సరం నుంచే వంద సీట్లతో తరగతులు ప్రారంభం కానున్నాయని రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ వెల్లడించారు. ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిలో రూ.28 లక్షల వ్యయంతో కంటి శస్త్రచికిత్సలు నిర్వహించేందుకు ఏర్పాటుచేసిన ఫాకో మిషన్‌ను కలెక్టర్ వీ.పీ.గౌతమ్‌తో కలిసి మంత్రి బుధవారం ప్రారంభించారు. అనంతరం హైదరాబాద్ నుంచి రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. ఆతర్వాత పాత కలెక్టరేట్‌లో ప్రభుత్వ మెడికల్ కళాశాల నిర్వహణకు జరుగుతున్న నిర్మాణాలు, ఆధునికీకరణ పనులను పరిశీలించాక మంత్రి మాట్లాడారు.



మెడికల్ కళాశాల ఆధునికీకరణ పనులను పరిశీలిస్తున్న మంత్రి

అత్యాధునిక వైద్యసేవలు

మెడికల్ కళాశాల ఏర్పాటుకు చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయని మంత్రి పువ్వాడ వెల్లడించారు. పాత కలెక్టరేట్ భవనం, ఆర్అండ్‌బీ కార్యాలయం కలిపి ఎనిమిది ఎకరాలను మెడికల్ కళాశాలకు కేటాయించగా, పనులు చేపట్టామని తెలిపారు. పాత కలెక్టరేట్ భవనాన్ని రూ.9 కోట్లతో ఆధునికీకరించి బోధనకు వినియోగించనున్నట్లు చెప్పారు. కళాశాల నిర్మాణ పనుల కోసం రాష్ట్రప్రభుత్వం సుమారు రూ.166కోట్లు మంజూరు చేయగా, వంద సీట్ల భర్తీకి అనుమతులు కూడా లభించాయని తెలిపారు. కాగా, పెద్దాస్పత్రిలో అధునాతన పరికరాలు ఏర్పాటుచేయడంతో ఉమ్మడి ఖమ్మం జిల్లాతో పాటు మహబూబాబాద్, సూర్యాపేట, ఏపీలోని జిల్లాల నుంచి కూడా వైద్యం కోసం ఇక్కడకు వస్తున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ కొండబాల కోటేశ్వరరావు, మెడికల్ కళాశాల ఇన్‌చార్జ్ ప్రిన్సిపాల్ డాక్టర్ సరిత, ఇన్‌చార్జ్ డీఎంహెచ్‌ఓ డాక్టర్ వి.సుబ్బారావు, టీఎస్ఎంఎస్ఐడీసీ ఈఈ ఉమామహేశ్వరరావు, మెడికల్ సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓలు బి.శ్రీనివాసరావు, అమర్‌సింగ్, వైద్యులు రాముునాయక్, వెంకటనర్సయ్య, శ్రీధర్, రాజశేఖర్ గౌడ్, సుడా చైర్మన్ విజయ్‌కుమార్, క్లైమెంట్ తదితరులు పాల్గొన్నారు.

పార్టీని వీడిన వారంతా తిరిగొస్తున్నారు..

- తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడడమే లక్ష్యం
- కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ మాణిక్‌రావ్ ఠాక్రే
- పొంగులేటితో కలిసి బహిరంగ సభాస్థలి పరిశీలన

ఖమ్మంమయూరిసెంటర్: కాంగ్రెస్‌ను వీడి వెళ్లిన వారు మళ్లీ తిరిగి సొంత గూటికి వస్తున్నారని తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇంచార్జి మాణిక్‌రావు ఠాక్రే తెలిపారు. వచ్చేనెల 2వ తేదీన ఖమ్మంలో జరగనున్న తెలంగాణ జనగర్జన సభాస్థలిని బుధవారం ఆయన మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డితో కలిసి పరిశీలించారు. అనంతరం పొంగులేటి క్యాంపు కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఠాక్రే మాట్లాడారు. ఖమ్మంలో 2న నిర్వహించనున్న తెలంగాణ జనగర్జన సభలోనే భట్టి పాదయాత్ర ముగింపు, మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, ఆయన అనుచరుల చేరిక ఉంటుందని తెలిపారు. తెలంగాణ వ్యాప్తంగా 105 రోజుల నుంచి సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క ప్రజలతో మమేకమై పాదయాత్ర చేస్తున్నారన్నారు. భట్టి పాదయాత్ర ఖమ్మం జిల్లాకు చేరుకున్న నేపథ్యాన 2వ తేదీన ముగుస్తుందని చెప్పారు. ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి పార్టీలో చేరుతున్న సందర్భంగా నిర్వహిస్తున్న సభలో ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ పాల్గొని వారిని ఆహ్వానిస్తారని వివరించారు. కాంగ్రెస్ మరింత పటిష్టమయ్యేలా శ్రీనివాసరెడ్డి లాంటి నాయకులను స్వాగతిస్తున్నామని తెలిపారు. ఆయనకు ఉన్న పేరు కాంగ్రెస్‌కు బలం చేకూరుస్తుందని చెప్పారు. ఏదిఏమైనా అందరి లక్ష్యం తెలంగాణలో కేసీఆర్ పాలనకు చరమగీతం పాడడమేనని ఠాక్రే స్పష్టం చేశారు. జనగర్జన సభ సందర్భంగా ఖమ్మంలో భారీ ర్యాలీ నిర్వహిస్తుండగా రాహుల్‌గాంధీ, టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, ఇతర ముఖ్య నేతలు పాల్గొంటారన్నారు. జిల్లా కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అంతా ఒక్కటై సభను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.



సభాస్థలిలో ఏర్పాట్లను ఠాక్రేకు వివరిస్తున్న శ్రీనివాసరెడ్డి

చకచకా ఏర్పాట్లు

వచ్చేనెల 2న ఖమ్మంలో జరగనున్న తెలంగాణ జనగర్జన సభకు ఏర్పాట్లు చురుగ్గా సాగుతున్నాయి. పనులను కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జ్ ఠాక్రేతో పాటు మాజీ ఎంపీ పొంగులేటి పరిశీలించారు. సభావేదిక, గ్యాలరీ నిర్మాణం, సభాస్థలికి చేరుకునే మార్గాలు, హెలీప్యాడ్ ఏర్పాటుపై చర్చించారు. ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్న పొంగులేటి ప్రసాద్‌రెడ్డి, తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ మంత్రి సంబాని చంద్రశేఖర్, మార్క్‌ఫెడ్ రాష్ట్ర మాజీ వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, బానోతు విజయాబాయి తదితరులు పాల్గొన్నారు.

కళ్లారా కష్టాలను చూశా...



నాయకన్‌గూడెం సభలో మాట్లాడుతున్న భట్టి విక్రమార్క, పక్కన నాయకులు

- బీఆర్ఎస్‌కు చరమగీతం.. ఇందిరమ్మ రాజ్య స్థాపనే లక్ష్యం
- సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క
- జిల్లాకు చేరిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర

కూసుమంచి: పాదయాత్రలో భాగంగా ఆదిలాబాద్ నుండి పాలేరు వరకు ప్రజలు పడుతున్న కష్టాలను కళ్లారా చూశానని సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టివిక్రమార్క వెల్లడించారు. ఈ కష్టాలు తొలగిపోయి ప్రజలు సుఖంగా జీవించాలంటే రాష్ట్రంలో బీఆర్ఎస్ పాలనను అడ్డుకోవాల్సిన అవసరముందని తెలిపారు. లేనిపక్షంలో ప్రజలు మరింత నష్టపోవాల్సి వస్తుందని చెప్పారు. భట్టి చేపట్టిన పీపుల్స్‌మార్చ్ పాదయాత్ర బుధవారం రాత్రి సూర్యాపేట జిల్లా మీదుగా ఖమ్మం జిల్లాలోకి కూసుమంచి మండలం నాయకన్‌గూడెం వద్ద ప్రవేశించింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభలో భట్టి మాట్లాడుతూ తెలంగాణ వస్తే కష్టాలకు పరిష్కారం లభిస్తుందని భావించిన అన్నివర్గాల ప్రజలు ఉద్యమానికి మద్దతు ఇచ్చారని తెలిపారు. కానీ అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్.. ప్రజల సమస్యలను పట్టించుకోకపోగా నిరుద్యోగుల ఆశలను చిదిమేసిందని ఆరోపించారు. ఫలితంగా పీజీలు చేసినా ఉద్యోగాలు రాక యువత సహా అన్ని వర్గాల ప్రజలు సతమతమవుతున్నారని తెలిపారు. మరోపక్క బీఆర్ఎస్ నాయకులు దోపిడీయే లక్ష్యంగా పనిచేస్తున్నారని ప్రభుత్వ భూములను అమ్ముకోవటంతో పాటు సాగర్ కాల్వల మట్టిని కూడా వదలడం లేదని ఆరోపించారు. అడ్డుపడితే అక్రమంగా కేసులు పెడుతున్నారని మండిపడ్డారు. ఇక పాలేరు ఎమ్మెల్యే కాంగ్రెస్ ఓట్లతో గెలిచి రూ.వేల కోట్ల కాంట్రాక్టుల కోసం పార్టీ మారారని దుయ్యబట్టారు. అయినప్పటికీ ఏదో చేసినట్లుగా ప్రజల్లో తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు. అలాంటి ఎమ్మెల్యేను గెలిపించామని పాలేరు ప్రజలు సిగ్గుపడుతున్న నేపథ్యాన వచ్చే ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని భట్టి పిలుపునిచ్చారు. కాగా, రాష్ట్రంలో ఇందిరమ్మ రాజ్యాన్ని తీసుకొస్తామని, ధరణిని తొలగించి రైతుల ఇబ్బందులు తీరుస్తామని ఆయన ప్రకటించారు. కాగా, రైతులకు రైతు బంధు కొనసాగింపు, రూ.2లక్షల రుణమాఫీపై అపోహలకు గురికావొద్దని సూచించారు. అంతేకాకుండా పేదలు ఇళ్లు నిర్మించుకునేందుకు రూ.5లక్షలు ఇస్తామని.. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలిచి ప్రభుత్వాన్ని ఏర్పాటుచేయడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు.



డప్పుచప్పుళ్ల నడుమ నృత్యం చేస్తున్న మహిళలు, చిత్రంలో భట్టి సతీమణి నందిని

భట్టికి ఘనస్వాగతం

సీఎల్పీ నేత, మధిర ఎమ్మెల్యే మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర నాయకన్‌గూడెం వద్ద జిల్లాలోకి ప్రవేశించగా.. కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనస్వాగతం పలికాయి. గిరిజన మహిళల నృత్యాల నడుమ మహిళలు మంగళహారతులతో భట్టికి తిలకం దిద్దడమే కాక గజమాలతో సత్కరించారు. పాలేరు నియోజకవర్గంతో పాటు జిల్లాలోని ఇతర నియోజకవర్గాల నుండి భారీగా పార్టీ నాయకులు తరలివచ్చారు. తొలిరోజు నాయకన్‌గూడెం నుండి పాలేరు వరకు భట్టి తన పాదయాత్ర కొనసాగించి రాత్రి బస చేశారు. ఈకార్యక్రమంలో భట్టి సతీమణి నందినితో పాటు మాజీ మంత్రి సంభాని చంద్రశేఖర్, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావుతోపాటు నాయకులు రాయల నాగేశ్వరరావు, జావేద్, రాంరెడ్డి చరణ్‌రెడ్డి, మట్టి గురవయ్య తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు చేపట్టాలి

కల్లూరు: ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియకు వెంటనే షెడ్యూల్ విడుదల చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు నాగమల్లేశ్వరరావు డిమాండ్ చేశారు. యూటీఎఫ్ మండల అధ్యక్షుడు రాయల నాగేశ్వరరావు అధ్యక్షతన బుధవారం కల్లూరులో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయులు, విద్యారంగ సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం కాలయాపన చేస్తోందని ఆరోపించారు. భవనాలు, వసతులు సమకూర్చినంత మాత్రాన పాఠశాలలు బలోపేతం కావని, విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా ఉపాధ్యాయుల పోస్టులు భర్తీ చేయాలన్నారు. అనంతరం ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించడంతో పాటు జేఈఈ, నీట్ ర్యాంకులు సాధించిన పొంగా సాయి నిఖితా రెడ్డి తదితరులను సన్మానించారు. సమావేశంలో మండల కార్యదర్శి విజయ్‌తో పాటు ఎస్.సతీశ్, అమర్‌నాథ్, వేముల శ్రీనివాస్, ఇందుప్రియ, పొంగా శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

తాత్కాలిక వంతెన తొలగించాలని లేఖ

ఖమ్మంఅర్బన్: ఖమ్మం వెలుగుమట్ల అటవీ పార్కు సమీపాన సాగర్ ప్రధాన కాల్వపై మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కుమారుడి వివాహం సందర్భంగా ఏడాది కిందట నిర్మించిన తాత్కాలిక వంతెనను తొలగించకపోవడమే కాక మళ్లీ పనులు చేస్తుండడంతో జలవనరులశాఖ అధికారులు లేఖ రాశారు. ఈఈ అనన్య గతంలోనే లేఖ రాయగా తొలగిస్తామని తొమ్మిది నెలల కిందట శ్రీనివాసరెడ్డి సోదరుడు ప్రసాద్‌రెడ్డి సమాధానం ఇచ్చినట్లు తెలిపారు. అయితే, మళ్లీ పనులు చేస్తుండడంతో లేఖ రాయగా, ఇప్పటికిప్పుడు తొలగించలేమని, గడువు కావాలంటూ ప్రసాద్‌రెడ్డి కోర్టును ఆశ్రయించి స్టే తీసుకొచ్చినట్లు తెలిసింది. పొంగులేటి కాంగ్రెస్‌లో చేరనున్న సందర్భంగా వచ్చేనెల 2న ఏర్పాటుచేసిన బహిరంగ సభావేదికకు వెళ్లేందుకు ఇక్కడ బ్రిడ్జి నిర్మిస్తుండడంతో అధికారులు లేఖ ఇవ్వడం గమనార్హం.

రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో చోరీ

పెనుబల్లి: మండలంలోని వీఎంబంజర్ రైతు ఆగ్రోస్ సేవా కేంద్రంలో మంగళవారం అర్ధరాత్రి చోరీ జరిగింది. సత్తుపల్లిరోడ్డులోని కేంద్రంలో షట్టర్ పగలగొట్టిన దుండగులు కౌంటర్‌లో భద్రపర్చిన రూ.1.50 లక్షలు ఎత్తుకెళ్లారు. బుధవారం షాపునకు వచ్చిన యజమాని నిమ్మగడ్డ నాగరాజు చోరీ జరిగిందని గుర్తించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ జి.సూరజ్ తెలిపారు. కాగా, సీసీ ఫుటేజీల్లో నమోదైన నిందితుడి చిత్రాలను పోలీసులు విడుదల చేశారు.

లారీ ఢీకొని వ్యక్తి మృతి

ఖమ్మంక్రైం: లారీ ఢీకొనడంతో ద్విచక్ర వాహనదారుడు మృతి చెందిన ఘటన మంగళవారం అర్ధరాత్రి ఖమ్మంలో చోటు చేసుకుంది. టూటౌన్ పోలీసుల కథనం ప్రకారం.. ఆంధ్రప్రదేశ్‌లోని పశ్చిమగోదావరి జిల్లా కూనవరం మండలం తేకుబాకకు చెందిన నేలతూరి నరేశ్ (30) హైదరాబాద్‌లో ఇటీవలే ఓ ప్రైవేట్ ఉద్యోగంలో చేరాడు. మంగళవారం సాయంత్రం హైదరాబాద్ బయలుదేరిన ఆయన భద్రాచలంలో భార్యను ఆర్టీసీ బస్సు ఎక్కించి ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అర్ధరాత్రి 12.30 గంటల సమయాన రాపర్తినగర్ బ్రిడ్జి వద్ద వర్షంలో వెళ్తున్న ఆయన్ను లారీ ఢీకొట్టగా టైరు కింద పడి మృతి చెందాడు. వాహనదారులు ఇచ్చిన సమాచారంతో ఎస్‌ఐ అప్పారావు చేరుకుని ద్విచక్ర వాహనం నంబర్ ఆధారంగా కుటుంబీకులకు సమాచారం ఇచ్చారు.

దాడి ఘటనపై కేసు

కూసుమంచి: మండలంలోని చింతలతండాలో ఇరువర్గాల మధ్య జరిగిన ఘర్షణకు సంబంధించి బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. తండాకు చెందిన బాదావత్ హర్జా, విజయ్, మంగు, బుల్లి తమకు భూమిలో వాటా ఉందంటూ అదే గ్రామానికి చెందిన బాదావత్ సరస్వతి, ఆమె మామ రాముపై దాడి చేశారు. ఈమేరకు సరస్వతి ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ రమేశ్‌కుమార్ తెలిపారు.

బెదిరింపులపై కేసు నమోదు

భద్రాచలంఅర్బన్: బెదిరింపుల ఘటనపై బుధవారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్‌ఐ శ్రీకాంత్ కథనం ప్రకారం.. పట్టణంలోని కొత్తపేట కాలనీకి చెందిన లోకేష్ ఇంటికి ఈ నెల 22న రాత్రి వినోద్, సందీప్‌తోపాటు మరికొందరు వెళ్లి దూషించారు. చంపుతానని బెదిరించగా బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదైంది.

ఖమ్మం మార్కెట్ ధరలు

(క్వింటాకు రూ.లలో)

	గరిష్ట	కనిష్ట
మొక్కజొన్న	1,830	1,775
పెసలు	7,601	5,800
కందులు	8,800	8,800
మిర్చి	19,600	13,500
ఏసీ మిర్చి	24,300	18,500
మిర్చి తాలు	13,000	8,000
పత్తి	6,600	5,000

– ఖమ్మం వ్యవసాయం

పామాయిల్ గెలలు

టన్ను ధర	రూ.13,346

నేడు తొలి ఏకాదశి..

- అన్నదాతలకూ ప్రత్యేకం
- ప్రత్యేక పూజలకు ఆలయాల ముస్తాబు

ఆనందంతో పాటు ఆరోగ్యానిచ్చే పండుగ తొలి ఏకాదశి. హిందువుల తొలి పండుగగా పిలిచే ఈ పండుగకు హైందవ సంస్కృతిలో విశేష స్థానం ఉంది. దీనినే శయన ఏకాదశి, హరి వాసరం, పేలాల పండుగగా పిలుస్తారు. ఈరోజు నుంచి

తొలి ఏకాదశి..

దక్షిణాయనం ప్రారంభాన్ని సూచిస్తుంది. ఈమేరకు భక్తులు సూర్యోదయాన్నే శ్రీహరిని పూజించి, విష్ణుమూర్తి ప్రతిమను అలంకరించి నైవేద్యం సమర్పిస్తారు. ఇక తొలి ఏకాదశిని రైతుల పండుగగా కూడా చెబుతారు. అతివృష్టి, అనావృష్టి ఏర్పడకుండా, పంటలకు తెగుళ్లు ఆశించకుండా ఉండాలని అన్నదాతలు తొలి ఏకాదశి రోజున ఇళ్లు, ఆలయాల్లో పూజలు చేస్తారు. ఏరు ముందా.. ఏకాశి ముందా.. అనే సామెతపై రైతుల మధ్య చర్చ జరగడం కనిపిస్తుంది. అయితే ఈ ఏడాది వర్షాలు అనుకూలించకపోవటంతో ఏకాదశే ముందుగా వచ్చింది. కాగా, తొలి ఏకాదశి రోజు పేలాల పిండి తప్పక తినాలని పెద్దలు చెబుతారు. ఆరోగ్యపరంగానూ ఇది మంచిదని విశ్వాసం.

తొలి ఏకాదశి, బక్రీద్ పండుగలు ఒకే రోజు వచ్చాయి. హిందువులు జరుపుకునే తొలి ఏకాదశి, ముస్లింలు రంజాన్ తర్వాత ఘనంగా జరుపుకునే బక్రీద్ పండుగలు గురువారం రావడం విశేషం. ఆయా పండుగలను హిందువులు, ముస్లింలు వారివారి సంప్రదాయల్లో ఘనంగా జరుపుకునేందుకు సిద్ధమయ్యారు.

– ఖమ్మంగాంధీచౌక్

ఏకాదశిని వేడుకగా జరుపుకుంటాం



తొలి ఏకాదశి పండుగ వేడుకగా జరుపుకుంటాం. పంటలకు ప్రకృతి వైపరీత్యాలు సంభవించకుండా, తెగుళ్ల బారిన పడకుండా ఉండాలని ప్రత్యేక పూజలు చేస్తాం. ఆరోగ్యం కోసం మొక్కజొన్న పేలాలను పిండిగా చేసి తినడం ఆనవాయితీగా వస్తోంది.

–మిర్యాల విక్రమ్‌రెడ్డి, రైతు, బీరోలు, తిరుమలాయపాలెం మండలం

ప్రకృతిలో మార్పులకు సంకేతంగా..



ప్రకృతిలో జరిగే మార్పులకు సంకేతం తొలి ఏకాదశి. సూర్య భగవానుడు ఈరోజు నుంచి దక్షిణాయనం వైపునకు మరలుతాడు. హిందువులు తొలి ఏకాదశిని తొలి పండుగగా జరుపుకోనుండగా, రైతులకు కూడా ప్రత్యేకం. ఈరోజు ఉపవాసం, జాగరణ చేస్తారు.

–నందుల సుబ్రహ్మణ్యశర్మ, పురోహితులు, శ్రీరాంనగర్, ఖమ్మం

బక్రీద్ కూడా నేడే



వేడుకలకు ముస్తాబైన మసీదు

ప్రత్యేకంగా జరుపుకుంటాం



బక్రీద్ పండుగను ప్రత్యేకంగా జరుపుకుంటాం. బక్రీద్ పండుగ రోజున ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు చేస్తాం. బక్రీద్ పండుగ నుంచి ముస్లిం పెద్దలు హజ్ యాత్ర ప్రారంభించటం ఆనవాయితీ. సౌదీ అరేబియాలోని మక్కాకు వెళ్లి ప్రార్థనలు చేస్తారు.

–ఎస్‌కే షరీఫ్, గాంధీనగర్, ఖమ్మం

ముస్లింలు రెండు పండుగలను ప్రధానంగా జరుపుకుంటారు. ఇందులో రంజాన్ తర్వాత అత్యంత ఘనంగా నిర్వహించే పండుగల్లో బక్రీద్ గురువారం జరుపుకోనున్నారు. ఇస్లాం మత విశ్వాసాల ప్రకారం త్యాగానికి ప్రతీకగా బక్రీద్ పండుగను జరుపుకోవటం ఆనవాయితీ. ఈ పండుగను ఈదుల్ అజహా అనికూడా అంటారు. బక్రీద్ అంటే బకర్ ఈద్ అని అర్థం. బకర్ అంటే మూగజీవి, ఈద్ అంటే పండుగ అని చెబుతారు. ఈ మాసం ప్రారంభంలోనే ముస్లింలు హజ్ యాత్రకు బయలుదేరుతారు. అరబ్ దేశంలోని సౌదీ అరేబియాలో ఉన్న మక్కా మసీద్‌లో ఏడు ప్రదక్షిణలు చేసి ప్రార్థనలు చేస్తారు. బక్రీద్ పండుగ రోజు ప్రత్యేక వంటకాలు చేయడమే కాక ఖుర్బానీ పంచడం ఆనవాయితీగా వస్తోంది.

మాదక ద్రవ్యాల రవాణాపై గట్టి నిఘా

- అందరూ బాధ్యతగా భావించాలి
- నార్కోటిక్స్ కమిటీ సమావేశంలో కలెక్టర్ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: మాదక ద్రవ్యాల అక్రమ రవాణాను అరికట్టేలా గట్టి నిఘా ఏర్పాటు చేశామని, ప్రజలు కూడా దీనిని బాధ్యతగా భావించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం, సరఫరాను నియంత్రించేందుకు జిల్లాస్థాయి నార్కోటిక్స్ కోఆర్డినేషన్ కమిటీ సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం ఏర్పాటుచేశారు. పోలీస్ కమిషనర్ విష్ణు ఎస్.వారియర్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా, ఎక్సైజ్ సూపరింటెండెంట్ నాగేందర్‌రెడ్డి పాల్గొన్న ఈ సమావేశంలో కలెక్టర్ గౌతమ్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల సరఫరాను మూలాల వద్దే అడ్డుకునేలా అధికారులు కృషి చేయాలన్నారు. ప్రజల సహకారంతో ఇది సాధ్యమవుతుందని తెలిపారు. ఇందుకోసం మాదక ద్రవ్యాలతో కలిగే అనర్థాలపై విస్తృతంగా అవగాహన కల్పించాలని సూచించారు. సీపీ వారియర్ మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగాన్ని కట్టడి చేయకుంటే సమాజంపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని పేర్కొన్నారు. బీసీ సంక్షేమ శాఖాధికారి జ్యోతి, డీఈఓ సోమశేఖరశర్మ, జిల్లా ప్రధానాస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, డీఐఈఓ రవిబాబు, ఎస్సీ డీడీ కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కలెక్టర్ గౌతమ్, పక్కన సీపీ వారియర్, అసిస్టెంట్ కలెక్టర్ రాధికాగుప్తా

గడువులోగా లేఔట్లకు అనుమతులు

ఖమ్మంమయూరిసెంటర్: లేఔట్ల అనుమతి కోసం అందే దరఖాస్తులను గడువులోగా పరిష్కరించాలని కలెక్టర్ వీపీ గౌతమ్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. కేఎంసీలో జరిగిన జిల్లాస్థాయి లేఔట్ కమిటీ సమావేశంలో కేఎంసీ, సుడా పరిధిలో అందిన 24 దరఖాస్తులను పరిశీలించి అన్నీ సక్రమంగా ఉన్న వాటిని ఆమోదించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో దరఖాస్తులను సంబంధిత శాఖల అధికారులు పరిశీలించి 21 రోజుల్లోగా అనుమతి జారీ చేయాలని తెలిపారు. కేఎంసీ కమిషనర్ ఆదర్శ్ సురభి, అదనపు కలెక్టర్ స్నేహలత, ఇరిగేషన్ సీఈ శంకర్‌నాయక్, ఆర్డీఓ రవీంద్రనాథ్, జెడ్పీ సీఈఓ వీవీ అప్పారావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ శ్రీనివాసులు, ఆర్‌అండ్‌బీ ఎస్‌ఈ లక్ష్మణ్, పీఆర్ ఈఈ కేవీకే శ్రీనివాస్, సత్తుపల్లి, వైరా, మున్సిపల్ కమిషనర్లు సుజాత, వెంకటేశ్వర్లు, తహసీల్దార్లు శైలజ, సుమ, సైదులు, నరసింహారావు పాల్గొన్నారు.

నగదు రహిత ఈహెచ్‌ఎస్ అమలుచేయాలి



కలెక్టరేట్ ఎదుట ఆందోళన నిర్వహిస్తున్న పెన్షనర్లు

ఖమ్మంమయూరిసెంటర్: పెన్షనర్లకు నగదు రహిత ఎంప్లాయీస్ హెల్త్ స్కీం (ఈహెచ్‌ఎస్)ను అమలు చేయడంతో పాటు అన్ని కార్పొరేట్ ఆస్పత్రుల్లో వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల జేఏసీ కోఆర్డినేటర్ టి.పురుషోత్తం డిమాండ్ చేశారు. జేఏసీ పిలుపు మేరకు బుధవారం కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పురుషోత్తం మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై దాటవేత ధోరణి అవలంబిస్తోందని ఆరోపించారు. ఇకనైనా పెండింగ్ డీఆర్ విడుదల చేయడమే కాక పీఆర్‌సీ నియమించి.. ఐఆర్ ప్రకటించాలన్నారు. అనంతరం కలెక్టరేట్‌లో అధికారులకు వినతిపత్రం అందజేశారు. జేఏసీ బాధ్యులు సరిశ పుల్లయ్య, కల్యాణం నాగేశ్వరరావు, ఎస్.రంగారావు, డి.తిరుపతయ్య, సత్యనారాయణ, కె.కృష్ణమూర్తి, జి.శ్రీనివాసరావు, ఆర్.శ్రీరాములు, కె.వెంకటేశ్వర్లు, దావా చిట్టెమ్మ, మాధవరావు, కుటుంబరావు, కోట్యా, శేషభూషణం, శర్మ పాల్గొన్నారు.

2.48 లక్షల మంది రైతుల ఖాతాల్లో రూ.157.10 కోట్లు

ఖమ్మంవ్యవసాయం: ప్రస్తుత వానాకాలం సాగుకు అవసరమైన పెట్టుబడి సాయాన్ని రైతుబంధు ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రైతుల ఖాతాల్లో జమ చేస్తోంది. సోమవారం నుంచి రైతుల ఖాతాల్లో నగదు జమ ప్రక్రియ ప్రారంభం కాగా బుధవారం నాటికి 2,48,149 మంది ఖాతాల్లో రూ.157.10 కోట్లు జమ అయ్యాయని వ్యవసాయ శాఖ అధికారులు వెల్లడించారు. తొలిరోజు ఎకరం వరకు భూమి విస్తీర్ణం కలిగిన 1,18,126 మంది రైతుల ఖాతాల్లో రూ.36.90 కోట్లు, మంగళ, బుధవారాల్లో రెండు నుంచి నాలుగు ఎకరాల వరకు భూమి కలిగిన 1,30,023 మంది రైతుల ఖాతాల్లో రూ.120.20 కోట్లు జమ అయ్యాయని తెలిపారు. జిల్లాలో 3,32,893 మంది రైతులకు రైతుబంధు సాయం అందనుండగా, ఈనెల 18 నాటికి కొత్తగా పట్టాదారు పాస్ పుస్తకాలు పొందిన 15,969 మంది రైతులను కూడా జాబితాలో చేర్చారు.

సాయి మందిరంలో యాదాద్రి ప్రధాన అర్చకుడి పూజలు

ఖమ్మంగాంధీచౌక్: ఖమ్మం గాంధీచౌక్‌లోని వరప్రదాత షిర్డీ సాయిమందిరాన్ని యాదాద్రి భువనగిరి జిల్లా లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ప్రధాన అర్చకులు డాక్టర్ నల్లందీఘల్ లక్ష్మీనరసింహాచార్యులు బుధవారం సందర్శించారు. ఈ సందర్భంగా గురుపౌర్ణమి వేడుకల్లో పాల్గొన్న ఆయన సాయినాథుడికి చందనంతో అభిషేకం నిర్వహించారు. ఆ తర్వాత సుదర్శన హోమం, మహాపూర్ణాహుతి, శ్రీ సీతారామచంద్ర కల్యాణానికి హాజరయ్యారు. ఆలయ కమిటీ చైర్మన్ వేములపల్లి వెంకటేశ్వరరావుతో పాటు అర్వపల్లి నిరంజన్, కురువెళ్ల జగన్మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.



సాయినాథుడికి అభిషేకం చేస్తున్న లక్ష్మీనరసింహాచార్యులు

నిర్వాసితులకు నిరాశే!

- సమస్యలు చెప్పుకునే అవకాశం ఇవ్వని ద్విసభ్య కమిటీ
- సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌పై పూర్తి అధ్యయనం చేయాలన్న పిటిషనర్లు

అశ్వాపురం: మండలంలోని కుమ్మరిగూడెంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సీతమ్మ సాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్ట్‌లో భాగంగా నిర్మిస్తున్న సీతమ్మ సాగర్ బ్యారేజీని చెన్నై నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్(ఎన్‌జీటీ) ద్విసభ్య కమిటీ బుధవారం సందర్శించింది. పర్యావరణ అనుమతి లేకుండా పనులు చేస్తున్నారంటూ కొందరు నిర్వాసితులు ఎన్‌జీటీకి ఫిర్యాదు చేసిన విషయం విదితమే. దీంతో క్షేత్రస్థాయి పరిశీలనకు కమిటీ సభ్యులైన మినిస్ట్రీ ఆఫ్ ఎన్విరాన్‌మెంట్ అండ్ ఫారెస్ట్ రీజినల్ డైరెక్టర్ కె.తరుణ్, గోదావరి నది జలాల నిర్వహణ బోర్డు సూపరింటెండెంట్ ఇంజనీర్ ప్రసాద్ రాగా, నిర్వాసితులు తమ గోడు చెప్పుకునేందుకు చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో వారు నిరాశగా వెనుదిరగాల్సి వచ్చింది. కమిటీ సభ్యులు అమ్మగారిపల్లిలోని ఎల్‌అండ్‌టీ సంస్థ కార్యాలయంలో పిటిషనర్లు తెల్లం నరేష్, లక్ష్మీనారాయణ, జలవనరుల శాఖ అధికారులతో మాత్రమే సమావేశమై చర్చించారు. ఇరుపక్షాలు తమ వాదనలు వినిపించిన తర్వాత సీతమ్మ సాగర్ బ్యారేజీని పరిశీలించారు.

రోజంతా ఎదురుచూసినా..

ద్విసభ్య కమిటీకి తమ సమస్యలు తెలిపేందుకు ఎల్‌అండ్‌టీ కార్యాలయం వద్ద అమ్మగారిపల్లి, కుమ్మరిగూడెం గ్రామాలకు చెందిన సీతమ్మసాగర్ ప్రాజెక్ట్ భూ నిర్వాసితులు రోజంతా ఎదురుచూసినా.. కమిటీ సభ్యులతో మాట్లాడే అవకాశం దక్కలేదు. కోర్టు ఉత్తర్వుల మేరకు పిటిషనర్లు, అధికారులతో మాత్రమే మాట్లాడామని, నిర్వాసితుల సమస్య అంశం తమ పరిధిలో లేదని కమిటీ సభ్యులు తెలిపారు.



సీతమ్మ సాగర్ బ్యారేజీ వద్ద ద్విసభ్య కమిటీ సభ్యులు, అధికారులు

ప్రాజెక్ట్‌పై అధ్యయనం చేయాలి...

సీతమ్మ సాగర్ ప్రాజెక్ట్‌పై పూర్తి స్థాయిలో అధ్యయనం చేసి, నిర్వాసితులకు న్యాయం చేయాలని పిటిషనర్ తెల్లం నరేష్ కమిటీ సభ్యులను కోరారు. 70 శాతం పనులు పూర్తయ్యాక ప్రజాభిప్రాయసేకరణ చేపట్టడం సరికాదని, నిబంధనలు ఉల్లంఘించి పనులు చేపడుతున్న అంశాలను కమిటీకి వివరించానని చెప్పారు. భూ నిర్వాసితులకు ఎకరాకు రూ.30 లక్షలు పరిహారం ఇవ్వాలని, జల విద్యుత్ కేంద్రంలో నిర్వాసితుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం అవకాశం ఇవ్వాలని డిమాండ్ చేశారు. అంతకుముందు కమిటీ సభ్యులు తరుణ్, ప్రసాద్ విలేకరులతో మాట్లాడుతూ.. క్షేత్రస్థాయిలో తాము పరిశీలించిన అంశాలు, పిటిషనర్లు, అధికారుల వాదనలపై పూర్తి నివేదికను ఎన్‌జీటీకి అందజేస్తామని తెలిపారు. కార్యక్రమంలో జలవనరుల శాఖ సీఈ శ్రీనివాసరెడ్డి, ఎస్‌ఈ వెంకటేశ్వరరెడ్డి, ఈఈ శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఖమ్మం నుంచి 50 వేల మంది సమీకరణ

ఖమ్మంమయూరిసెంటర్: మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి కాంగ్రెస్‌లో చేరనున్న సందర్భంగా వచ్చేనెల 2న నిర్వహిస్తున్న తెలంగాణ జనగర్జన సభకు ఖమ్మం నగరం నుంచే 50 వేల మందిని తరలించేలా కృషి చేయాలని డీసీసీబీ డైరెక్టర్ తుళ్లూరి బ్రహ్మయ్య సూచించారు. ఖమ్మంలో బుధవారం సాయంత్రం జరిగిన సన్నాహక సమావేశంలో ఆయన మాట్లాడుతూ శ్రీనివాసరెడ్డి, అనుచరగణం కాంగ్రెస్‌లో చేరనున్న సభకు ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీతో పాటు జాతీయ, రాష్ట్రస్థాయి నేతలు హాజరవుతారని తెలిపారు. నగరం నుంచి ఎక్కువ మంది పాల్గొనేలా నాయకులు కృషి చేయాలని కోరారు. సమావేశంలో మద్దినేని బేబీస్వర్ణకుమారి, ముదిరెడ్డి నిరంజన్‌రెడ్డి, కార్పొరేటర్లు దుద్దుకూరి వెంకటేశ్వర్లు, మలీదు జగన్, దొడ్డా నగేశ్, మిక్కిలినేని నరేంద్ర, కొప్పెర ఉపేందర్, బాణాల లక్ష్మణ్, మియాబాయ్, స్వరూపారాణి తదితరులు పాల్గొన్నారు.

కులసంఘాలకు స్థలాల అప్పగింత

రఘునాథపాలెం: జిల్లా గౌడ, పద్మశాలి సంఘాలకు కేటాయించిన స్థలాలను బుధవారం సంఘాల బాధ్యులకు అప్పగించారు. రఘునాథపాలెం సర్వే నంబర్ 17లో ఒక్కో సంఘానికి 29 కుంటల అసైన్డ్ భూమిని ప్రభుత్వం 2018లో కేటాయించగా, రైతు బి.చీనా కుటుంబం కోర్టుని ఆశ్రయించింది. దీంతో సంఘాలు కూడా కోర్టులో పిటిషన్ దాఖలు చేయడంతో 2022లో స్టే తొలగించారు. నాటి నుంచి స్థలంపై వివాదం కొనసాగుతుండగా సంఘాల నాయకులు కలెక్టర్‌ను ఆశ్రయించారు. ఈ ఈమేరకు కలెక్టర్ ఆదేశాలతో తహసీల్దార్ జి.నరసింహారావు స్థలాలకు హద్దులు నిర్ధారించి అప్పగించారు. ఎస్‌ఐ రవి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో పద్మశాలి సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కమర్తపు మురళి, చిలకమర్రి శ్రీనివాసబాబు, గౌరవ అధ్యక్షుడు బొమ్మ రాజేశ్వరరావు, నగర అధ్యక్షుడు పెండెం జనార్దన్, పిల్లలమర్రి కొండల్‌రావు, గౌడ సంఘం నాయకులు పాల్గొనగా.. ఆయా స్థలాల్లో ఆగమేఘాలపై నిర్మాణాలు చేపట్టారు.



కేటాయించిన స్థలంలో పద్మశాలి సంఘం నాయకులు

ఎదురెదురుగా ఢీకొన్న రెండు డీసీఎంలు

కల్లూరు: కల్లూరులోని ఖాన్‌ఖాన్‌పేట వద్ద కెనరా బ్యాంక్ సమీపాన బుధవారం రెండు డీసీఎంలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో ముగ్గురికి గాయాలయ్యాయి. సత్తుపల్లి మండలం గంగారం నుంచి ఐరన్ లోడ్‌తో వెళ్తున్న డీసీఎం, ముంబై నుంచి విశాఖపట్నంకు డ్రమ్స్‌తో వెళ్తున్న డీసీఎం కెనరాబ్యాంక్ ఎదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో రెండు వాహనాల ముందు భాగాలు నుజ్జునుజ్జు కాగా, మహారాష్ట్ర సోలాపూర్‌కు చెందిన డ్రైవర్ కేశవ్ ఒబాల్, క్లీనర్ దిలీప్‌తో పాటు ఇంకో వాహనం డ్రైవర్ చింతకాని మండలం పొద్దుటూరుకు చెందిన మరీదు రామకృష్ణకు గాయాలయ్యాయి. వారిని కల్లూరు ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ఈ ప్రమాదంతో రాకపోకలకు అంతరాయం ఏర్పడగా పోలీసులు చేరుకుని ట్రాఫిక్ క్రమబద్ధీకరించారు.



ప్రమాదంలో దెబ్బతిన్న డీసీఎం వాహనాలు

గంజాయి మత్తులో చోరీకి యత్నం

- నిందితుడిని పోలీసులకు అప్పగించిన స్థానికులు

ఖమ్మంక్రైం: ఖమ్మం 51వ డివిజన్‌లో పది రోజులుగా స్థానికులను భయభ్రాంతులు గురిచేస్తూ గంజాయి మత్తులో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తిని స్థానికులు బుధవారం పట్టుకుని పోలీసులకు అప్పగించారు. సూర్యాపేట జిల్లా హుజూర్‌నగర్‌కు చెందిన గోపి (నవీన్) ఎన్నెస్పీ క్యాంప్‌లో గంజాయి, మద్యం తాగుతూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాడు. ఈ క్రమంలో దొంగతనాలకు కూడా పాల్పడుతుండగా స్థానికులు కమిటీగా ఏర్పడి బుధవారం ఆయనను బంధించి పోలీసులకు సమాచారం ఇవ్వగా అదుపులోకి తీసుకున్నారు. బీఆర్‌ఎస్, సీపీఐ నాయకులు శీలంశెట్టి వీరభద్రం, జ్వాలా నర్సింహారావుతో పాటు స్థానికులు వల్లపు ఉదయ్‌కిరణ్, సుర మహేశ్, హరి, వి.నరేశ్, జాల శ్రీను, ప్రవీణ్, సతీశ్, మాడుగుల శ్రీను, చల్లా గాంధీ, చల్లా మహేశ్, కిట్టు, ఎ.అశోక్ పాల్గొన్నారు.



గోపిని పోలీసులకు అప్పగిస్తున్న స్థానికులు

వరిగడ్డివాము దగ్ధం

తల్లాడ: మండలంలోని పినపాక గ్రామంలో బుధవారం జరిగిన అగ్ని ప్రమాదంలో 13 ఎకరాల్లోని వరిగడ్డి వాము దగ్ధమైంది. పాత పినపాక గ్రామంలో ఓ వ్యక్తి మృతి చెందగా అంత్యక్రియల్లో భాగంగా బాణసంచా కాలుస్తున్న సమయంలో నిప్పురవ్వలు ఎగిసి రైతు పొన్నం ముకుందరావుకు చెందిన వరిగడ్డి వాముపై పడ్డాయి. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగి గడ్డి కాలిపోయింది. స్థానికులు, అగ్నిమాపక శాఖ సిబ్బంది చేసిన ప్రయత్నాలు ఫలించకపోగా రూ.70 వేల విలువైన గడ్డి కాలి బూడిదైంది.

యువకుడిపై బీర్ బాటిల్‌తో దాడి

ఖమ్మంక్రైం: ఓ యువకుడిపై కొందరు బీర్‌బాటిల్‌తో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. నేలకొండపల్లి మండలం పైనంపల్లికి చెందిన శశికుమార్ ఖమ్మం రైల్వేస్టేషన్ సమీపంలోని బార్‌లో మద్యం తాగేందుకు ఈ నెల 26న రాత్రి వెళ్లాడు. అప్పటికే అర్ధరాత్రి 12 గంటలు అవుతుండగా ఆటోలో మరికొందరు యువకులు వచ్చారు. అక్కడ శశికుమార్‌తో వారికి ఘర్షణ జరగగా ఆటోలో వచ్చినవారు ఆయనపై బీర్ బాటిల్‌తో దాడి చేయగా తీవ్రగాయాలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆస్పత్రిలో చికిత్స పొందుతుండగా, బాధిత కుటుంబీకులు బుధవారం ఖమ్మం వన్‌టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేశారు.

రోడ్డుప్రమాదంలో ఇద్దరికి గాయాలు

రఘునాథపాలెం: మండల కేంద్రమైన రఘునాథపాలెంలోని ఎస్‌ఎస్.మూర్తి కాలేజీ ఎదురుగా ఖమ్మం – ఇల్లెందు ప్రధాన రోడ్డులో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కామేపల్లి మండలం గోవింద్రాలకు చెందిన గుగులోత్ నరేష్, ఖమ్మం పాకబండబజార్‌కు చెందిన శ్రీనివాస్ వేర్వేరు వాహనాలపై వస్తూ ఢీకొనడంతో గాయాలయ్యాయి. క్షతగాత్రులను ఆస్పత్రిలో చేర్పించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.